# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 19 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 23-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

సులువుగ తెగిపోదు సున్నిత దారంబు
పెనుగులాటతోడ వీడిపోవు
బంధములును గూడ పగతోడ యట్లుయే
శాంతి, సత్యములన సర్వశుభము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.





## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

### ఆర్సీబీపై 55 పరుగుల తేడాతో ఘన విజయం

- ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ హాఫ్ సెంచరీల విధ్వంసం
- మెరుగైన రన్‌రేట్‌తో క్వాలిఫయర్ 1కు చేరిన ఆర్‌సీబీ, గుజరాత్ టైటాన్స్

**న్యూఢీల్లి మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారీ విజయంతో క్వాలిఫయర్ 1 ఆడాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలపై ఆర్సీబీ నీళ్లు చల్లింది. ఉప్పల్‌లో 256 పరుగులు ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమివ్వగా.. కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సన్‌రైజర్స్ బౌలర్లు గొప్పగా రాణించినా ఆర్సీబీని 165లోపు కట్టడి చేయలేకపోయారు. దాంతో...-మిగతా 2 లో



2 లో

## భారత్‌లో భానుడి భగభగలు..

- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే
- మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ



2 లో

## కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..

ధరలు పెరిగే అవకాశం!

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

## తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం

- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ప్రకటించారు. ఇందుకోసం ప్రజా ప్రభుత్వం -మిగతా 2 లో





## పెద్దల ఎన్నికకు.. నగారా!

- 24 రాజ్యసభ స్థానాలకు ఈసీ నోటిఫికేషన్
- ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నిక
- జూన్ 1 నుంచి నామినేషన్ల స్వీకరణ
- 18న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

**న్యూఢిల్లీ,** దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 24 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 4 స్థానాలతో పాటు గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు ఓట్లు లెక్కిస్తారు. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 10వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించింది. జూన్ 18వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామంది. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గుజరాత్‌లో 4, కర్ణాటకలో 4, మధ్యప్రదేశ్‌లో 3, రాజస్థాన్‌లో 3, జార్ఖండ్‌లో 2 స్థానాలతో పాటు మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరంలో ఒక్కో -మిగతా 2 లో



## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

### వేద పాఠశాలకు భూమిపూజ

**హైదరాబాద్** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి -మిగతా 2 లో



## భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- సంబంధాలు పెంచుకునేలా కొత్త వేగం అందించడానికి రెడీ
- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్
- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం
- సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ
- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు : సైప్రస్

**న్యూఢిల్లీ :** భారత్, సైప్రస్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు.గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు -మిగతా 2 లో



## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

- మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా
- కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను
- ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

2

### ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా

## రైతు గోస పట్టదా?

### కల్లాల్లోనే చనిపోతున్నా పంట కొనరా?

సర్కార్‌ను నిలదీసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

- ధాన్యం కొనుగోలు చేయాలని సచివాలయం వద్ద టీఆర్ఎస్ ధర్నా
- అక్కడే బైఠాయించిన కవిత
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- అరెస్ట్ చేసి ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**హైదరాబాద్, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వానికి రైతు గోస పట్టదా? మండుతున్న ఎండలతో వడదెబ్బకు గురై కల్లాల్లోనే రైతన్నలు ఊపిరి వదులుతున్నా పంటలు కొనుగోలు చేయరా? అంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సర్కార్‌ను నిలదీశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ -మిగతా 2 లో





## ఎండలపై అప్రమత్తత

- తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన
- హీట్ వేవ్ పై రాష్ట్రవ్యాప్తంగా అలెర్ట్
- ప్రజలకు అవగాహన, అప్రమత్తత చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లదే
- సీఎం చంద్రబాబు సమీక్ష

**ఏపీ బ్యూరో:** ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలన్నారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు -మిగతా 2 లో




## కాక్రోచ్‌పై అక్కసు..

- సీజేపీకి చెక్ పెట్టేందుకు హిట్ జనతా పార్టీతో ట్రోలింగ్
- సామాజిక మాధ్యమాల్లో 'బొద్దింక' వ్యతిరేక శక్తుల యుద్ధం

**న్యూఢిల్లీ,** రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో పుట్టుకు వచ్చి దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి వస్తున్న ఆదరణను చూసి దేశంలోని పలు పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఇటీవల సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పుట్టుకొచ్చిన ఈ పార్టీని ఇప్పటికే లక్షలాది మంది అనుసరిస్తున్నారు. సీజేపీకి పెరుగుతున్న ఆదరణకు బ్రేక్ వేయడానికి తాజాగా 'హిట్ జనతా పార్టీ' పేరుతో డిజిటల్ వేదికపైకి ట్రోలింగ్ మొదలైంది. బొద్దింకలను చంపే ప్రసిద్ధ బ్రాండ్ 'హిట్' స్ప్రే పేరుని ఆధారంగా చేసుకుని ఏఐ సాయంతో దీని పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఈ పోస్టర్‌లో హిట్ స్ప్రే రసాయనం ధాటికి ఒక బొద్దింక గిలగిలా కొట్టుకుని చచ్చి పడిపోయినట్టుగా చూపించారు. పోస్టర్‌పై 'హిట్ జనతా పార్టీ' అని రాసి, కింద త్రివర్ణ పతాక రంగుల సర్కిల్‌లో 'స్వచ్ఛ్ ఘర్, సురక్షిత భారత్' అనే నినాదాన్ని -మిగతా 2 లో

# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

మొదటి తరువాయి



హైదరాబాద్ మూడో స్థానానికే పరిమితమైంది.ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌కు బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకోగా.. ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమిచ్చాడు. శివాంగ్ ఓవర్లో మూడు సిక్సర్లు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు పిండుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. సిక్సర్‌కు యత్నించిన అయ్యర్ మిడాన్‌లో అభిషేక్ చేతికి చిక్కాడు. కాసేపటికే షకీబ్ ఓవర్లో కవర్స్‌లో ఆడిన విరాట్ కోహ్లీ(15) స్మరణ్ చేతికి చిక్కాడు. దాంతో. పవర్ ప్లేలో ఆర్సీబీ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కీలక వికెట్లు పడడంతో పడిక్కల్, పటిదార్ ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నారు.
కానీ, పడిక్కల్‌ను ఔట్ చేసి రెండో వికెట్ సాధించాడు మలింగ. ఆ తర్వాత కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) .. సన్‌రైజర్స్ క్వాలిఫయర్ 1 అవకాశాల్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఆడాడు. పెద్ద షాట్లకు వెళ్లకుండావికెట్ కాపాడుకుంటూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. పార్ట్ టైమ్ బౌలర్ హెడ్ ఓవర్లో పాటిదార్ పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద చిక్కాడు. 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ జయభేరి మోగించింది.

**ఇషాన్, క్లాసెన్ దంచేయగా**

క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్వివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్ధ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించి

# భారత్‌లో భానుడి భగభగలు..

**- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే**

**-మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ**




**న్యూఢిల్లీ, మే 22:**

భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ

న్యూఢిల్లీ, మే 22: భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..

**ధరలు పెరిగే అవకాశం!**




న్యూఢిల్లీ
పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు చివరికి కండోమ్‌ల ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కండోమ్‌ల ప్రాథమిక నిర్మాణం సహజ రబ్బరు లాటెక్స్‌పై ఆధారపడినప్పటికీ, తుది ఉత్పత్తిని సిద్ధం చేయడానికి చమురు నుంచి సేకరించే మిశ్రమం ఎంతో అవసరం అవుతుంది. ముడి చమురు ధరలు పెరిగిన కారణంగా కండోమ్‌ల తయారీకి అవసరమైన లూబ్రికెంట్లు, సింథటిక్ రబ్బర్, స్టెబిలైజింగ్ కెమికల్స్ వ్యయం పెరుగుతున్నది.కండోమ్‌ల లూబ్రికేషన్ కోసం తయారీదారులు సిలికాన్ ఆయిల్‌పై, ప్యాకేజింగ్ కోసం అల్యూమినియం ఫాయిల్స్, ప్లాస్టిక్ ఫిల్మ్‌లపై అధికంగా ఆధారపడుతుంటారు. వీటి ధరలు పెరిగిన కారణంగా కండోమ్ ఉత్పత్తుల రిటైల్ ధరలను పెంచడం తప్పనిసరి అవుతున్నదని భారత్‌కు చెందిన హెల్త్‌కేర్ కంపెనీ 'మ్యాన్‌కైండ్ ఫార్మా' తెలిపింది. పెరిగిన ముడిసరుకు ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి తరువాయి



కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయమని వివరించారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల దృక్పథంతో బ్యాంకులు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై ప్రభుత్వం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని తెలిపారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని భట్టి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏయే రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువగా దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.

## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

మొదటి తరువాయి

బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# రైతు గోస పట్టదా?

మొదటి తరువాయి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సచివాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నాకు దిగారు. సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కవిత, టీఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు ధర్నా చేస్తున్న ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అక్కడ నుండి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ లకు తరలించారు.

**సర్కారుకు బుద్ధి రావాలని**

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతుల గోస పట్టని సర్కారుకు బుద్ధి రావాలని సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టామన్నారు. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి బాసటగా నిలవాలన్న సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ ఫైర్ అయ్యారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కలు, పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను ఆరబెడుతూ కాంటా వేసే వారి కోసం ఎదురు చూస్తున్నారని వివరించారు. తూకంలో తరుగు తీస్తున్నారు. తేమ పేరిట కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా చెప్తూ రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖను సమీక్షించని సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమంటూ వ్యాఖ్యానించారు.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి బుద్ధి తెచ్చుకుని ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇవాళ సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపాం. ఇది శాంపిల్ మాత్రమే... వానలు పడే లోపే కొనుగోళ్లను పూర్తిచేయకపోతే... తెలంగాణ రక్షణ సేన రంగంలోకి దిగుతుందని, మీ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

# కాక్రోచ్‌పై అక్కసు..

మొదటి తరువాయి

జోడించారు. కాక్రోచ్ జనతా పార్టీకి చెక్ పెట్టడానికి, ఈ ట్రెండ్‌ను మరింత హాస్యాస్పదంగా మార్చడానికి కొందరు హిట్ జనతా పార్టీతో అక్కసు వెళ్లగక్కుతున్నట్టు తెలుస్తున్నది. అయితే ఈ అక్కసు వెనుక అధికార బీజేపీ పార్టీ హస్తం ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపై ఆ పార్టీ వారు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**ప్రతిపక్షం అంది పుచ్చుకోవాలి: శశిథరూర్, కాంగ్రెస్ ఎంపీ**

సోషల్ మీడియాలో విపరీతమైన ప్రజాదరణ పొందిన వ్యంగ్య వేదిక 'కాక్రోచ్ జనతా పార్టీ'(సీజేపీ) 'ఎక్స్' ఖాతాను నిలిపివేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌ను గమనించి, యువతను తమవైపు తిప్పుకొనేందుకు ప్రతిపక్షపార్టీలు కృషి చేయాలని సూచిస్తూ, ఇది ప్రతిపక్షాలు తప్పక ఉపయోగించుకోవాల్సిన అవకాశం' అని శశి థరూర్ 'ఎక్స్'లో రాశారు. సీజేపీ ఖాతాను బ్లాక్ చేయడం తీరని నష్టం, తీవ్ర అవివేకం అని ఆయన పేర్కొన్నారు. దేశంలోని యువత తమ భావాలను వ్యక్తీకరించేందుకు ఒక వేదిక ఉండాలని థరూర్ అన్నారు.

కేవలం ఐదు రోజుల్లోనే ఇన్‌స్టాగ్రామ్‌లో 15 మిలియన్ల కంటే ఎక్కువ(ప్రస్తుతం 19 మిలియన్లు దాటింది) ఫాలోవర్లను సంపాదించుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' అసాధారణ వృద్ధి తనను ఎంతగానే ఆకర్షించిందని థరూర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'యువత ఎదుర్కొంటున్న నిరాశా, నిస్పృహలను నేను అర్థం చేసుకోగలను. వారు ఈ వేదికతో ఎందుకు కనెక్ట్ అవుతున్నారో కూడా నాకు తెలుసు. అందుకే 'ఎక్స్'లో ఈ ఖాతాను నిలిపివేయడం తప్పు. యువత తమ భావాలను పంచుకోవడానికి ఒక వేదిక అవసరం. అందుకే సీజేపీ ఖాతాను మూసివేయకుండా, దానిని యథావిధిగా నడవనివ్వండని కోరారు.

# ఎండలపై అప్రమత్తత

మొదటి తరువాయి

అత్యవసర సమీక్ష నిర్వహించారు.

**ప్రజల్ని అప్రమత్తం చేయండి**

తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాల్పుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాటో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియజేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పెద్దల ఎన్నికకు..నగారా!

మొదటి తరువాయి

రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

**ఏపీలో నాలుగు స్థానాలకు...**

వాటితో పాటూ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21వ తేదీతో వైసీపీ నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టీడీపీ నుంచి ఎంపికైన కనకమేడల రవీంద్రకుమార్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమి కైవసం చేసుకోనుంది.

# భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

మొదటి తరువాయి

దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోడీ తెలిపారు. ఇటీవల భారత్- యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ - సైప్రస్‌కు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఉద్దేశంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.

**ఈ విభాగాల్లో ఎంఓయూలు**

భారత్, సైప్రస్‌ను డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్స్ వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సాంస్కృతిక సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైన ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం భారత్‌కు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైన ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్టు మోడీ తెలిపారు. భారత్- సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు.

**ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్**

"ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేసే అంశంపై భారత్- సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్ బలోపేతం, రక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్ మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రధానంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోడీ తెలిపారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా



న్యూఢిల్లీ,
రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్ని' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

# నేటి రాశి ఫలితాలు



**మేషరాశి**
వివాదాలు రాజి చేసుకుంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలబ్ధి కలుగుతుంది. మిత్రుల నుండి విలువైన విషయాలు తెలుస్తాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. పక్షులకు ద్రాహం తీరిస్తే శుభకరం

**వృషభరాశి**
ప్రయాణాలలో అలసట అధికమవుతుంది. బంధువర్గంతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ఋణ ఒత్తిడి పెరుగుతుంది. గోమాతకు పశుగ్రాస పెడితే శుభకరం

**మిధునరాశి**
ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందుతారు. నూతన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. ఆర్థిక పరిస్థితి ఉత్సాహాన్నిస్తుంది. వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. పారే నీటిలో బెల్లం వదిలితే శుభకరం

**కర్కాటకరాశి**
ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి. ధనపరంగా ఒత్తిడి పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి. నల్ల చీమలకు చక్కెర పెడితే శుభకరం

**సింహరాశి**
కొత్త వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారమున ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. అవసరానికి సన్నిహితుల సహాయం అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలు సజావుగా సాగుతాయి. నల్ల గ్రామ సింహాలకు బెల్లం పెడితే శుభకరం

**కన్యరాశి**
సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. నూతన వ్యాపారమునకు పెట్టుబడులు పెట్టి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. భూవివాదాలు పరిష్కారమౌతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. నాగుల పుట్ట వద్ద కోడి గుడ్డు పెడితే శుభకరం

**తులరాశి**
ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన శిరో బాధలు తప్పవు. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. వ్యాపార విస్తరణలో ఆటంకాలు కలుగుతాయి. ఉద్యోగాలలో అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. పారనీటిలో అన్నంతో శివలింగం చేసి వదిలితే శుభకరం

**వృశ్చికరాశి**
సొంత ఆస్తి వివాదాలు మరింత బాధిస్తాయి. సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. మానసిక అశాంతి కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ముఖ్యమైన పనులలో కష్టపడ్డా ఫలితం కనిపించదు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. జమ్మి చెట్టు వద్ద పెసర గుగ్గిళ్ళు పెడితే శుభకరం

**ధనస్సురాశి**
మీరు చేపట్టిన కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపార విషయమైన పెద్దల సలహా తీసుకోవడం మంచిది. చేపట్టిన పనులు ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు. దైవచింతన పెరుగుతుంది. రావి చెట్టు ప్రదక్షణ శుభకరం

**మకరరాశి**
విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ విషయంలో ముఖ్య నిర్ణయాలు అమలుచేస్తారు. రాజకీయ వర్గాల నుండి ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. నిరుద్యోగుల కలలు ఫలిస్తాయి. కాకులకు ఆహారం పెడితే శుభకరం.

**కుంభరాశి**
సొంత వారితో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. నూతన ఋణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగమున ఊహించని సమస్యలు కలుగుతాయి. దైవ చింతన పెరుగుతుంది. బిల్వ ప్రదర్శన శుభకరం

**మీనరాశి**
మీ విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త అవసరం. ప్రయాణాలు వాయిదా వెయ్యవలసి వస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్థిక విషయాలు గందరగోళంగా ఉంటాయి. చేపట్టిన పనులు మధ్యలో విరమిస్తారు. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. మర్రిచెట్టు మొదట్లో పాలు పోస్తే శుభకరం

**శ్రీ కాలభైరవ ఉపాసకులు**
**దక్క జంబులయ్య (స్వామి )**
**9491163914**



# నందికొట్కూరులో ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు







**నందికొట్కూరు, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని సంగయ్యపేట రాయల్ ప్యాలస్ ఫంక్షన్ హాల్లో నూతన జీవనోపాధి, ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు ప్రత్యామ్నాయ వృత్తులు, ప్రభుత్వ సబ్సిడీ రుణాలు, ఉపాధి అవకాశాలపై వివిధ శాఖల అధికారులు వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రోహిబిషన్ ఢ ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్ మాట్లాడుతూ, "నాటుసారా వంటి చట్టవిరుద్ధ వ్యాపారాలను పూర్తిగా మానుకొని గౌరవప్రదమైన జీవనోపాధి వైపు అడుగులు వేయాలి. పీఎం విశ్వకర్మ వంటి పథకాల ద్వారా చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు" అని సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ, "స్వయం ఉపాధి, వ్యాపారాల స్థాపనకు బ్యాంకులు పూర్తి సహకారం అందిస్తాయి. గ్రూపులుగా ఏర్పడితే రుణాలు సులభంగా లభిస్తాయి. ఉన్నత చదువుల కోసం ఎడ్యుకేషన్ లోన్ సదుపాయం కూడా ఉంది" అని తెలిపారు. గ్రామీణ--పట్టణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, 8వ తరగతి చదివిన వారు విస్తారాకులు, పచ్చళ్ళు, వడియాలు వంటి గృహ పరిశ్రమలు పెట్టుకోవచ్చని అధికారులు వివరించారు. "రాబోయే జూన్ నెలలో నందికొట్కూరులో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నాం. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి" అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి (ఎన్‌కార్డ్ శాఖ), వెంకటరమణ (స్కిల్ డెవలప్మెంట్), ఎక్సైజ్ సి.ఐ. లక్ష్మణ దాసు, మోహన్ రెడ్డి, రామాంజనేయులు, ఎస్.ఐ. లుభాష్యం శ్రీనివాసులు, జగదీష్, మెప్మా అధికారి అర్చన, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## త్యాగం పౌరులే చేయాలా?

**న్యూఢిల్లీ మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వంటి ధరలు పెరిగి సామాన్యుడిపై భారం పడింది. ఈ నేపథ్యంలో శుక్రవారం పెట్రోల్, డీజిల్‌పై పన్నులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధ్యక్షుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు. 'త్యాగాలు చేయడం కేవలం పౌరుల నుంచి మాత్రమే ఆశించాలా? ప్రభుత్వాలు కూడా ఈ భారాన్ని పంచుకోవాలి. అందువల్ల, ముఖ్యమంత్రులందరితో జాతీయ సదస్సును ఏర్పాటు చేయాలని నేను ప్రధానిని కోరుతున్నాను' అని కమల్ హాసన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ప్రజలను భారాలను నుండి రక్షించడానికి తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ వంటి రాష్ట్ర పన్నులను తగ్గించాలి. రెండవది, రైలు, మెట్రో, బస్సు ఛార్జీలను కూడా తగ్గించాలి. తద్వారా ఎక్కువ మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించరు అని కమల్ హాసన్ వీడియో సందేశంలో అన్నారు.

# జీహెచ్ఎంసీ పరిధిలో ప్రతి వార్డుకు భారత రాజ్యాంగం

"గ్రామ గ్రామం - రాజ్యాంగం" కార్యక్రమానికి శ్రీకారం




**హైదరాబాద్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 300 వార్డులలో ఉచితంగా భారత రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీస్ ఆర్గనైజేషన్స్ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వర్ రాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామకృష్ణ ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి వార్డులో ఐదు రాజ్యాంగ ప్రతులను అందజేయనున్నట్లు తెలిపారు. "సేవ్ కానిస్టిట్యూషన్ -- సేవ్ ఇండియా" నినాదంతో గ్రామ గ్రామం -- రాజ్యాంగం కార్యక్రమాన్ని సంస్థ ప్రారంభించింది. మహేశ్వర్ రాజు మాట్లాడుతూ, "దేశంలోని ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం చదవాలి. బాబా సాహెబ్ అంబేద్కర్ తన జీవితాన్ని త్యాగం చేసి అందరికీ రాజ్యాంగాన్ని కానుకగా ఇచ్చారు. ప్రజాస్వామ్య విలువలు ప్రజలకు చేరేలా ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తాం" అని అన్నారు. ఈ సమావేశంలో ప్రొ. జి. మల్లేశం, తారిక్ మునీర్, ఎం. గంగాధర్, కోల జనార్దన్, గడ్డం జాన్సీ, షాహనా ఖాన్, పీవీ రమణ, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిప్పులు కురుస్తున్నాయి..

- విపరీతంగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- బయట ఎండ.. ఇంట్లో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- ముందస్తు జాగ్రత్తలతోనే ఉపశమనం



**ఆమనగల్లు, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎండలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంట్లో నుంచి కాలు బయట పెడితే చాలు ముచ్చెమటలు పడుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతుండటంతో ప్రజలు బయటకు రావడంలేదు. దీంతో ఉదయం 11 గంటల నుంచి రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక వైపు ఎండ తీవ్రత, మరోవైపు ఇళ్లలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

**లక్షణాలు గుర్తించాలి**

**ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు సూర్య కిరణాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. అధిక ఉష్ణోగ్రతకు లోనై కిందపడిపోవడం, కండరాలు పట్టేసినట్లు అనిపించడం వడదెబ్బకు ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలి. వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందేలా చూడాలి.**
- డాక్టర్ మైమున బేగం, ఆమనగల్లు

**జాగ్రత్తలు తప్పనిసరి..**
ఎండలు విపరీతంగా పెరుగుతుండటంతో బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. ఎప్పటికప్పుడు నీరు తాగుతునే ఉండాలి. శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే పండ్లను తినాలి. నూనె, మసాలాలు, వంటి ఆహారపదార్థాలకు, మద్యపానానికి దూరంగా ఉండాలి. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి ఉపయోగించాలి. కాటన్ లేత రంగు దుస్తులు ధరించాలి. కచ్చితంగా వెంట నీటిని ఉంచుకోవాలి. జాగ్రత్తలు పాటించకుంటే వడదెబ్బకు గురికావాల్సి వస్తుంది. ఎండలో ఎక్కువగా తిరిగితే వడదెబ్బ, అతిసార వ్యాధి వచ్చే అవకాశం ఉంది. శరీర ఉష్ణోగ్రత పెరిగిన సందర్భంలో ఫీట్స్, పాక్షిక లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరుకునే వీలుంది.
-వడదెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించాలి
-చల్లని నీరు లేదా ఐస్ శరీరాన్ని తుడవాలి.
-వదులుగా ఉన్న నూలు దుస్తులు వేయాలి.
- చల్లని నీరు లేదా ఉప్పు ఇతర లవణాలు కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి. వెంటనే చికిత్స కోసం సమీప ఆస్పత్రికి తరలించాలి.

# కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..

ధరలు పెరిగే అవకాశం!



**న్యూఢిల్లీ మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు చివరికి కండోమ్‌ల ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కండోమ్‌ల ప్రాథమిక నిర్మాణం సహజ రబ్బరు లాటెక్స్‌పై ఆధారపడినప్పటికీ, తుది ఉత్పత్తిని సిద్ధం చేయడానికి చమురు నుంచి సేకరించే మిశ్రమం ఎంతో అవసరం అవుతుంది. ముడి చమురు ధరలు పెరిగిన కారణంగా కండోమ్‌ల తయారీకి అవసరమైన లూబ్రికెంట్లు, సింథటిక్ రబ్బర్, స్టెబిలైజింగ్ కెమికల్స్ వ్యయం పెరుగుతున్నది. కండోమ్‌ల లూబ్రికేషన్ కోసం తయారీదారులు సిలికాన్ ఆయిల్‌పై, ప్యాకేజింగ్ కోసం అల్యూమినియం ఫాయిల్స్, ప్లాస్టిక్ ఫిల్మ్‌లపై అధికంగా ఆధారపడుతుంటారు. వీటి ధరలు పెరిగిన కారణంగా కండోమ్ ఉత్పత్తుల రిటైల్ ధరలను పెంచడం తప్పనిసరి అవుతున్నదని భారత్‌కు చెందిన హెల్త్‌కేర్ కంపెనీ 'మ్యాన్‌కైండ్ ఫార్మా' తెలిపింది. పెరిగిన ముడిసరుకు ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు.

# అగ్నిప్రమాదంలో పశుగ్రాసం, వైర్లు, మోటార్లు దగ్ధం





అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పశుగ్రాసం



ఆవేదనలో రైతు

**ఎలిగేడు, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని సుల్తానూర్ గ్రామ శివారులో ఎస్సారెస్పీ డీ--86 కాలువ నుండి వరి పొలాల్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ మంటలు సుల్తానూర్ శివారు నుండి నారాయణపల్లి శివారు వరకు వ్యాపించి వందలాది ఎకరాల్లో పంట పొలాల్లోని పశుగ్రాసం దగ్ధమైంది. రైతుల వ్యవసాయ బావులకు సంబంధించిన కరెంటు వైర్లు, కొంతమంది మోటార్లు కూడా కాలిపోయాయి. నష్టం జరిగిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేశారు.

# ఉపాధికూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్

**ఎలిగేడు (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లి గ్రామంలో ఉపాధిహామి కూలీలకు సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించి, ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. కూలీలకు కనీస వేతనం, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం పూటనే పనులకు వచ్చి, ఎండ ఎక్కువ కాకముందే పనులు ముగించుకోవాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎడ్ల సతీష్, మడ్లపల్లి అనిత--రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, కారోబార్ శ్రీనివాస్, కూలీలు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్ తగిలి మహిళ మృతి



**మర్రిగూడ, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండలంలోని రాంరెడ్డి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కరుణశ్రీ (25) మృతి చెందింది. తన ఇంటి పై బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురైన ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై బి. రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాల జాతర



**హుస్నాబాద్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కోహెడ మండల కేంద్రం, వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ప్రముఖ సామాజిక కార్యకర్త, ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, ఇతర మతాలను గౌరవిస్తూ సంప్రదాయాలను కొనసాగించడం భారతీయ సంస్కృతికి గొప్పతనమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని, అన్ని వర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పెద్దమ్మ తల్లి బోనాల జాతర కోహెడలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.

## డిండి వ్యవసాయ మార్కెట్‌లో
# తడిసి ముద్దవుతున్న పంట

**-బి కన్నీరు పెడుతున్న రైతన్నలు.**
**-డిండి మండల భారాస మాజీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర రావు.**



**దేవరకొండ మే 22. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
బి ఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు నల్గొండ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ ఆదేశం మేరకు డిండి మండలం కేంద్రంలో బిఆర్ ఎస్ పార్టీ శ్రేణులతో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వర రావు స్థానిక మార్కెట్ యార్డ్ ను సందర్శించటం జరిగింది ఈ సందర్బంగా డిండి లో గల స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు, రవాణా ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యం, రవాణా కాంట్రాక్టర్ల ఉదాసీనత వల్లే ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనిఅన్నారు. మార్కెట్ యార్డులో ఓపెన్ ప్లాట్‌ఫారాలపై ఉన్న వేలాది క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది. సరైన తార్పాలిన్లు (కవర్లు) అందుబాటులో లేకపోవడం, ఎగుమతి వేగంగా జరగకపోవడంతో రైతులు కళ్లముందే తమ పంట నీటిపాలు కావడం చూసి కన్నీరు మున్నీరవుతున్నారు. తడిసిన ధాన్యానికి రంగు మారి, మొలకలు వచ్చే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు.. పదుల సంఖ్యలో లారీల ధాన్యం వస్తున్నవి రెండే
ప్రస్తుతం డిండి మార్కెట్ యార్డులో దాదాపు 30 లారీలకు సరిపడా భారీ మొత్తంలో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. రోజురోజుకూ రైతులు తెస్తున్న ధాన్యంతో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం ఉన్నప్పటికీ, ఇక్కడి నుండి కేవలం రోజుకు 2 లేదా 3 లారీలలో మాత్రమే ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతులకు న్యాయం చేయాలి అని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమం లో మాధవరం శ్రీనివాస రావు, సర్పంచ్ మల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, బలముల తిరుపతయ్య,తండు చంద్రయ్య గౌడ్, యండిరషీద్, గుర్రం సురేష్,సీమర్ల మల్లయ్య,మూడవత్ భాస్కర్,మల్లేపాకుల జయవర్ధన్, ఎండీ బాసీత్,గద్దర్ శ్రీను, తండు శ్రీనయ్య, పేట వెంకటయ్య, అంకల్,సభవాట్ రాములు,కాసుల శ్రీను,జరుపుల భాస్కర్, రామావత్ బాలు, రామావత్ ధన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 98 జీవో దీక్షకు 58 రోజులు

**ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం విడ్డూరం : వెంకట్రామిరెడ్డి**



**నందికొట్కూరు (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరులో 98 జీవో దీక్ష 58 రోజులు పూర్తయినా స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం విడ్డూరమని రాయలసీమ సమితి అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టు బాధితులకు మద్దతు ప్రకటిస్తూ ఆయన మాట్లాడుతూ, "నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య వెంటనే స్పందించి న్యాయం చేయాలి. కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం" అని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నీటి ముంపు నిర్వాసిత బాధితులు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం



**నందికొట్కూరు, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్ఐఆర్--2026 సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం షెడ్యూల్ ప్రకటించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నందికొట్కూరు ఏఈఆర్వో, తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. 136--నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గం (ఎస్సీ) పరిధిలోని అన్ని జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులకు ఎస్ఐఆర్--2026 షెడ్యూల్ వివరించారు. ఈ సమావేశంలో జూపాడుబంగ్లా, పగిడ్యాల, పాములపాడు మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్, ఎలక్షన్ సీనియర్ సహాయకులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి చేయూత



**ఆమనగల్లు, మే 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన గండికోట యాదయ్య, గోవుల జంగయ్య, ఒర్సు శేఖర్ ల ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో చేయూతనందించారు. వారి ఇంటి నిర్మాణానికి సిమెంట్ బ్యాగులను శుక్రవారం కౌన్సిలర్ కాలే యశోదమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గంలో పేదలను ఆదుకోవడమే ఉప్పల వెంకటేష్ లక్ష్యమని తెలిపారు. గూడు లేని నిరుపేదలకు చెందిన ఇండ్ల నిర్మాణానికి ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలే విక్రమ్, వరికుప్పల బాబు, గండికోట వీరేష్, గండికోట శ్రీను, గోగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మర్రిగూడలో ఐకేపీ వీఓఏల నిరవధిక సమ్మె



**మర్రిగూడ, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఐకేపీ వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు వీఓఏలు నిరవధిక సమ్మె ప్రారంభించారు. వారు కనీస వేతనం రూ.20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్. పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రూప్ బీమా సౌకర్యం కల్పించి, అర్హులైన వీఓఏలకు సీసీ పదోన్నతులు ఇవ్వాలని కోరారు. "కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించే వరకు ఈ సమ్మె కొనసాగుతుంది" అని వీఓఏలు స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ కూలీలకు ఫోటో తిప్పలు



**మర్రిగూడ, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండలంలోని పలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో ఫేస్ రికగ్నిషన్, ఐరిస్ విధానాలు సరిగా పనిచేయకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాజరు నమోదు కోసం ఎక్కువ సమయం వృథా అవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "పాత పద్ధతిలోనే హాజరును సేకరించి పనిని కొనసాగించాలి" అని ఉపాధి హామీ కూలీలు అధికారులను కోరుతున్నారు.

# తెలంగాణ కుమ్మర ఆత్మగౌరవ భవన్‌కు నిధుల హామీ



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: తెలంగాణ రాష్ట్రంలో కుమ్మర్ల సామాజిక, ఆర్థిక, విద్యా, సాంస్కృతిక అభివృద్ధి కోసం నిర్మించనున్న కుమ్మర ఆత్మగౌరవ భవన్కు నిధులు మంజూరు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించనుందని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ కుమ్మర సంఘం 880/2014 రాష్ట్ర శాఖ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించగా, చైర్మన్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే బీసీల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు కాకులారం కృష్ణ తదితరులు పాల్గొన్నారు. కుమ్మర ఆత్మగౌరవ భవన్ నిర్మాణం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ స్పష్టం చేశారు.

## కరీంనగర్ అభివృద్ధికి
# యూసీఎఫ్ నిధులు

### సుడా చైర్మన్ కృతజ్ఞతలు



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణ అభివృద్ధికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.840 కోట్ల నిధులు మంజూరైనందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం హడ్కో రుణంతో పాటు తన వాటా భరించి కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రజలు దీనిని అభినందించాలని అన్నారు. గత స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.70 కోట్లతో మల్టీ స్టోరేజ్ పార్కింగ్, వరద నివారణ డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టణాల అభివృద్ధి కోసం ప్రధానికి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు లేఖలు పంపి కృషి చేయడం వల్లే యూసీఎఫ్ నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో వైద్యుల అంజన్ కుమార్, కాంతలా జగన్ రెడ్డి, పాడిశేటి భూమయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, గుండటి శ్రీనివాస రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బషీర్, సుదర్శన్, హనీఫ్, జిల్కర రమేష్ తదితరులు పాల్గొన్నారు.యూసీఎఫ్ నిధులు కరీంనగర్ రూపురేఖలను మార్చనున్నాయని సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు.

## యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ను ప్రారంభించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలో వీధి కుక్కల నియంత్రణ, జంతు సంక్షేమం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఆధునిక యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ను మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం అందించేందుకు ఏబీసీ సెంటర్ కీలకమని తెలిపారు. జంతువులకు హాని కలగకుండా శాస్త్రీయ విధానంలో శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్, వైద్య పరీక్షలు నిర్వహించి తిరిగి సంరక్షణతో విడిచిపెట్టనున్నట్లు చెప్పారు.నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారని, జంతువుల పట్ల ప్రేమ, బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కమిషనర్ సువార్త, కార్పొరేటర్లు, వెటర్నరీ వైద్యులు, జంతు సంక్షేమ సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.కరీంనగర్‌లో వీధి కుక్కల సమస్యకు ఏబీసీ సెంటర్ శాశ్వత పరిష్కారంగా నిలవనుంది.

# వరి కొయ్యలను కాల్చడం నేరం

### -- తహసీల్దార్ జే. సునీత



**పాలకుర్తి, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరి కొయ్యలను కాల్చడం చట్టపరంగా నేరమని పాలకుర్తి తహసీల్దార్ జే. సునీత స్పష్టం చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరించే గోడపత్రికను ఆవిష్కరించారు. ఎమ్మార్వో మాట్లాడుతూ, పొగ లేని పొలం -- రోగం లేని గ్రామం అనే నినాదంతో రైతులు గడ్డిని కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గడ్డిని కాల్చితే గాలి కలుషితం అవడంతో పాటు నేల సారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ హెచ్చరిస్తూ, రైతులు నిర్లక్ష్యంగా పొలాల్లో నిప్పు పెట్టి ఇతరులకు ఆర్థిక నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో టి. రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారులు బండి ప్రమోద్ కుమార్, బి. శశిధర్, ఎం. యోజన, ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ ఆఫీసర్ టి. ప్రశాంత్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.రైతులు గడ్డిని కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని అధికారులు పిలుపునిచ్చారు.

# పెన్షన్ లబ్ధిదారులకు ఈకెవైసీ తప్పనిసరి

**కరీంనగర్ రూరల్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బొమ్మకల్ పాత గ్రామపంచాయతీ 6వ డివిజన్ పరిధిలోని అన్ని పెన్షన్ లబ్ధిదారులు ఆధార్ లింక్ చేయడం తప్పనిసరి అని వార్డ్ ఆఫీసర్ ప్రకటించారు. రేపు మే 23 ఉదయం 9 గంటల నుంచి వార్డు కార్యాలయం, నూతన గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈకెవైసీ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు. పెన్షన్ పొందుతున్న వారు ఆధార్ కార్డు, పెన్షన్ కార్డుతో స్వయంగా హాజరుకావాలని సూచించారు.పెన్షన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈకెవైసీ పూర్తి చేయాలని అధికారులు స్పష్టం చేశారు.

## ఉపాధి హామీ కూలీలకు
# మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ

**తిమ్మాపూర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం రేణికుంట గ్రామ సర్పంచ్ ఎలుక ఆంజనేయులు ఆధ్వర్యంలో, మండల ఎంపీడీఓ రాజీవ్ మాల్వోత్రతో కలిసి మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మండే ఎండల్లో పని చేసే కార్మికులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఎక్కువగా నీరు తాగి, ఓఆర్ఎస్ వినియోగించాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కూలీలకు అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కొర్రి వంశీ, బావండ్ల ప్రవీణ్, కనపర్తి చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతి, ఆశా వర్కర్ ఎలుక శ్వేత, కూలీలు పాల్గొన్నారు.రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు ఆధ్వర్యంలో భారత దళిత ఉద్యమ పితామహుడు, గొప్ప సంఘ సంస్కర్త, విద్యా ప్రబోధకుడు శ్రీ భాగ్యరెడ్డి వర్మ జయంతి ఘనంగా



నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేసి నివాళులర్పించారు.సర్పంచ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన భాగ్యరెడ్డి వర్మ విద్య ద్వారానే సమాజ మార్పు సాధ్యమని నమ్మి పాఠశాలలను స్థాపించి బడుగు వర్గాల్లో చైతన్యం నింపారని అన్నారు. సమానత్వం, స్వాభిమానం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ల్యాగల దేవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కొర్రి వంశీ, బావండ్ల ప్రవీణ్, కనపర్తి చంద్రశేఖర్, నాయకులు గుర్రాల మధుసూదన్ రెడ్డి, దాసరి మధుకర్ రెడ్డి, గోలి లక్ష్మారెడ్డి, కర్ర బాబు, ఆవుసుల రమేష్, గుంటి మహేశ్, బోయిని రమేష్, సెక్రటరీ శ్రీధర్, గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.ఎండల్లో కార్మికుల ఆరోగ్య రక్షణతో పాటు, భాగ్యరెడ్డి వర్మ ఆశయాలను స్మరించుకున్న రేణికుంట గ్రామ ప్రజలు.

# వరి కొనుగోళ్లలో అవకతవకలు

### -మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆవేదన



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 40 శాతం వరి ధాన్యం కొనుగోలు జరగలేదని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.నేడు కలెక్టర్ చిత్ర మిశ్రాను కలసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసాలు, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.గత 45 రోజులుగా లారీల కొరత తీవ్రంగా ఉందని, మట్టి తరలింపుపై ఉన్న శ్రద్ధను ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు. నిల్వ ఉంచిన సంచులకు చెదలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రతి క్వింటాల్ వడ్లకు 10 కిలోల వరకు తరుగు పేరిట కోత విధించడం, 'ఏ' గ్రేడ్ ధాన్యాన్ని 'బి' గ్రేడ్‌గా మార్చి రూ.20 వరకు తగ్గించడం రైతులపై అన్యాయమని అన్నారు. లారీ యజమానులు ప్రతి బస్తాకు రూ.2 చొప్పున అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.జిల్లాలో దాదాపు 60 శాతం వరి ధాన్యం ఇంకా కేంద్రాల్లోనే మూలుగుతోందని, వర్షాలు కురిసే సూచనలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని రవిశంకర్ తెలిపారు. వెంటనే లారీలను ధాన్యం రవాణాకు మళ్లించి, యుద్ధప్రాతిపదికన తూకం వేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు బారాస నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ డిమాండ్ చేశారు.

## అభివృద్ధికి యూసీఎఫ్ నిధులు మైలురాయిగా నిలుస్తాయని బీజేపీ సంబరాలు




**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరాభివృద్ధి కోసం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.840 కోట్లు మంజూరైన నేపథ్యంలో తెలంగాణ చౌక్‌లో బీజేపీ శ్రేణులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.5,681 కోట్ల నిధులు మంజూరు చేయగా, అందులో కరీంనగర్‌కు ప్రత్యేకంగా రూ.840 కోట్లు ఆమోదించడం పట్ల నగరంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, స్థానిక ఎంపీ బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, మిఠాయిలు పంచుకున్నారు. సంబరాల్లో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నగర ప్రజలు పాల్గొన్నారు. కరీంనగర్ అభివృద్ధికి నిధులు మైలురాయిగా నిలుస్తాయని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

## వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలని కలెక్టరేట్ వద్ద బీజేపీ నిరసన



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వడ్లు, మొక్కజొన్న పంటలను తక్షణం కొనుగోలు చేయాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం, నాణ్యమైన వడ్లను బి గ్రేడ్‌గా మార్చి తరుగు పేరిట కోతలు విధించడం ద్వారా రైతులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. కనీస మద్దతు ధర చెల్లించకుండా దళారులు, ట్రేడర్లు తక్కువ ధరకే పంటలు కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు.రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. తరువాత కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, వడ్ల బి గ్రేడ్ దోపిడీని అరికట్టాలని, సంచులు, రవాణా సౌకర్యాలు సమకూర్చాలని, అదనపు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళ రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.రైతు ప్రయోజనాల కోసం చివరి గింజ కొనుగోలు జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

## రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

**కరీంనగర్ రూరల్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆదర్శనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గంగిశెట్టి లక్ష్మణ్ (60) వ్యాపార నష్టాల కారణంగా అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం, లక్ష్మణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం, ప్రైవేట్ చిట్టీలు నడుపుతూ నష్టపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. అప్పుదారులు డబ్బులు అడుగుతుండగా, చెల్లించలేని పరిస్థితిలో మే 21 సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.తరువాత తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ దగ్గర చెట్టుకు ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని మృతదేహం కనిపించింది. భార్య వినోద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవపంచనామా నిర్వహించి శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించారు.వ్యాపార నష్టాలు, అప్పుల ఒత్తిడి కారణంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.



# ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలు కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రం వద్ద ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిత్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దళిత మహిళల విద్యాభివృద్ధి కోసం భాగ్యరెడ్డి వర్మ హైదరాబాదు సంస్థానంలో 26 పాఠశాలలను స్థాపించి గట్టి పునాదులు వేశారని కొనియాడారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజ హితం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# కార్మికుల రిటైర్మెంట్ వయస్సు పెంచాలని డిమాండ్



**పాలకుర్తి, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలం బసంతనగర్‌లోని అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 58 నుండి 61 ఏళ్లకు పెంచాలని పర్మనెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు మల్క రామస్వామి, ప్రధాన కార్యదర్శి రమేష్ మౌర్య కంపెనీ అధికారులకు వినతిపత్రం అందజేశారు.మల్క రామస్వామి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సంఘ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంటానని, ప్రభుత్వరంగ సంస్థల్లో రిటైర్మెంట్ వయస్సు పెంపు అమలులో ఉన్నందున అల్ట్రాటెక్‌లో కూడా అదే విధానం అమలు చేయాలని కోరారు. చాలా మంది కార్మికులు వయస్సు పరిమితి కారణంగా చిన్న వయస్సులోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని, పనిచేసే శక్తి ఉన్నా ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రిటైర్మెంట్ వయస్సును 61 ఏళ్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.కార్మికుల భవిష్యత్తు భద్రత కోసం రిటైర్మెంట్ వయస్సు పెంపు అవసరమని సంఘం స్పష్టం చేసింది.

# మహిళా శిశు సంక్షేమ శాఖలో ఏసీబీ విచారణ

## అధికారుల బదిలీ డిమాండ్



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహిళా శిశు సంక్షేమ శాఖలో వరంగల్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల్లో ఏసీబీ దాడులు జరిగిన నేపథ్యంలో, కరీంనగర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో కూడా విచారణ కొనసాగుతున్నందున సంబంధిత అధికారులను వెంటనే బదిలీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పెల్లి యుగంధర్ డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ, విచారణ ఎదుర్కొంటున్న అధికారులను అదే స్థానంలో కొనసాగించడం వలన సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని, ఉద్యోగులపై ఒత్తిడి, వేధింపులు పెరిగే ప్రమాదం ఉందని ఆరోపించారు. గతంలో కూడా జిల్లా సంక్షేమ అధికారిపై ఉద్యోగులు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు.ప్రజా పాలన సమావేశంలో ఒక మహిళా ఉద్యోగిని అవమానకరంగా దూషించడంతో ఆమె రాజీనామా చేయాల్సి వచ్చిన ఘటనను ప్రస్తావిస్తూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదైన విషయాన్ని గుర్తు చేశారు.కాబట్టి విచారణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులను వెంటనే బదిలీ చేయాలని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.విచారణలో ఉన్న అధికారులను బదిలీ చేసి, ఉద్యోగుల భద్రతను కాపాడాలని ఏఐవైఎఫ్ నేత యుగంధర్ డిమాండ్ చేశారు.

# ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం

**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ డ సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఆన్లైన్ వెబినార్ ఘనంగా జరిగింది.అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ముఖ్య వక్తగా ఎస్.ఆర్.ఆర్. కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. పదాల తిరుపతి పాల్గొన్నారు.తన కీలకోపన్యాసంలో ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణలో స్థానిక సమాజ భాగస్వామ్యం అత్యంత అవసరమని, విద్యార్థులు, యువత, గ్రామీణ సమాజాలు వృక్షారోపణ, విత్తన బంతుల తయారీ, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి చిన్న చర్యల ద్వారా ప్రపంచ స్థాయిలో గొప్ప మార్పు తీసుకురాగలరని వివరించారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ, యువత



సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం విద్యార్థులు, అధ్యాపకులను ఆలోచింపజేసేలా ఆకట్టుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డా. టి. దినకర్ చిన్న కన్వీనర్‌గా, శ్రీమతి బొజ్జా శ్రీవల్లి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు.ఈ వెబినార్‌లో తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హలీం ఖాన్, తిరునహరి యుగేందర్, అధ్యాపకులు ఆంజనేయులు, సత్యనారాయణ, జయప్రకాష్, సార పాలపర్థి, అసంపల్లి స్వరూపారాణి, బుంగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. 11 రాష్ట్రాల విశ్వవిద్యాలయ ఆచార్యులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జీవవైవిధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని వెబినార్‌లో స్పష్టం చేశార

# రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం



**పెద్దపల్లి, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరి, మొక్కజొన్న కొనుగోళ్లు నెలరోజులు పూర్తయినా రైతులకు సరైన న్యాయం జరగలేదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగుదల పేరుతో అధిక తూకాలు వేయడం, సంచుల కొరత, కనీస సౌకర్యాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.డీసీఎంఎస్ గోదాంల వద్ద వేలిముద్రల కోసం రైతులు రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారని, వర్షాలు పడితే పంట పాడవుతుందనే భయంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఇటీవల మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రైతుల సమస్యలను ప్రస్తావించగా, అధికార పార్టీ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగడం దురదృష్టకరమని రాజ్‌కుమార్ విమర్శించారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి దిష్టిబొమ్మల రాజకీయాలు చేస్తే ప్రజలు గమనిస్తారని హెచ్చరించారు.ఈ నిరసనలో భాగంగా పెద్దపల్లి బస్టాండ్ చౌరస్తాలో ఎమ్మెల్యే విజయ రమణారావు దిష్టిబొమ్మను దహనం చేశారు.ఒక దిష్టిబొమ్మ కాల్చితే ప్రతి గ్రామంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాం. కానీ మా లక్ష్యం ప్రతీకారం కాదు, రైతులకు న్యాయం జరగడమే అని రాజ్‌కుమార్ స్పష్టం చేశారు. దాసరి మనోహర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేస్తూ, రైతుల ధాన్యం మొత్తం కొనుగోలు అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచాల శ్రీధర్, వెన్నం రవీందర్, పూదరి చంద్రశేఖర్, రెవెల్లి స్వామి, కేధం కిషోర్, కనుకుర్తి కార్తీక్, పల్లె మధు, రేండ్ల నాగరాజ్, ఖాదర్, ఆదిల్ ఖాన్, అజార్, అథార్, కుక్క మనోజ్, చొప్పరి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నేతలు స్పష్టం చేశారు.

# ఈవీఎం గోదాముల డోర్ లాక్ సీళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నంద్యాల, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న మాసపు తనిఖీల్లో భాగంగా నంద్యాల పట్టణంలోని టేక్కే మార్కెట్ యార్డ్లో భద్రపరిచిన ఈవీఎంల గోదాములను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాముల డోర్ లాక్ సీళ్ల స్థితిను పరిశీలించిన కలెక్టర్, ఈవీఎంల భద్రతకు సంబంధించిన రక్షణ చర్యలు, భద్రతా ప్రమాణాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అమలవుతున్నాయా అనే అంశాలను సమీక్షించారు."ఈవీఎంల భద్రత అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు.పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, లాగ్‌బుక్‌ను పరిశీలించి విధుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, అగ్నిమాపక పరికరాల పనితీరును కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌సీఏలో అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఏఐవైఎఫ్ డిమాండ్



**హుస్నాబాద్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో జరుగుతున్న అవినీతి, అక్రమ ఆర్థిక లావాదేవీలు, టికెట్ బ్లాక్ మార్కెట్ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని లిలిఏఐవైఎఫ్ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, అభిమానులకు టికెట్లు అందకుండా అధిక ధరలకు విక్రయించడం, ప్రభావశీల వర్గాలకు ప్రత్యేక కేటాయింపులు చేయడం ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు.హెచ్‌సీఏలో ఆర్థిక అక్రమాలు, నిధుల దుర్వినియోగం, పరిపాలనా లోపాలు, క్రికెట్ ఎంపికల్లో అన్యాయం జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. స్థానిక యువ క్రీడాకారులకు అవకాశాలు ఇవ్వాల్సిన సంస్థలో డబ్బు, రాజకీయ ప్రభావం పెరగడం వల్ల ప్రతిభ వెలుగులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.అందుకే హెచ్‌సీఏలో జరిగిన అన్ని ఆర్థిక లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, అవినీతికి పాల్పడిన అధికారులు, మధ్యవర్తులు, బ్లాక్ మార్కెట్ ముఠాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.టికెట్ విక్రయాల్లో పారదర్శక విధానం తీసుకురావడంతో పాటు స్థానిక యువ క్రికెటర్లకు న్యాయం జరిగేలా ఎంపిక విధానం అమలు చేయాలని కోరారు. అవినీతి అధికారులను కాపాడే ప్రయత్నం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. హెచ్‌సీఏలో అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నేతలు స్పష్టం చేశారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్



**పెద్దపల్లి, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు.జిల్లా ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ రెండున్నర ఏళ్లు గడిచినా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఉద్యమంలో పాల్గొని కేసుల పాలైన నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారికి 250 గజాల స్థలం, ఇల్లు, గుర్తింపు కార్డులు, అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగం, రైల్వే--బస్ పాస్, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్ వంటి హామీలను అమలు చేయాలని ఆయన గుర్తు చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో నిజమైన ఉద్యమకారులు ఉంటే తమను సంప్రదించాలని కోరుతూ, త్వరలోనే నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆరు మండలాల అధ్యక్షులను ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ అనుముల కళావతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రంగారపు శాంతలక్ష్మీ, రాష్ట్ర కో-కన్వీనర్ తోడేటి స్వరూప, ఉద్యమకారులు బోయిన సదానందం, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు. ఉద్యమకారుల త్యాగాలను గౌరవించి, వారికి న్యాయం చేయాలని వేదిక నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

# 'తరుగు' పేరిట రైతులను నిలువు దోపిడీ చేయొద్దు

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి : పల్లా ప్రవీణ్ రెడ్డి**



**దేవరకొండ, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 'తరుగు' పేరిట రైతులను నిలువు దోపిడీ చేయొద్దని పిఏసియస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి డిమాండ్ చేశారు.మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పిలుపు మేరకు శుక్రవారం కొండభీమనపల్లి కొనుగోలు కేంద్రంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయి. ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు లేక వడ్లు రోజుల తరబడి పేరుకుపోతున్నాయి. తేమ, నాణ్యత పేరుతో అనవసర కోతలు విధిస్తున్నారు. పేరుకే కేంద్రాలు ప్రారంభించారని, కానీ ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు" అని విమర్శించారు.రైతులు ఎండలో, వర్షంలో రోజులు తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని, అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోతున్నా రక్షణ చర్యలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అన్ని కేంద్రాల్లో పారదర్శకంగా కాంటాలు జరగాలి. సరిపడా లారీలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే తరలించాలి. రైతుల వడ్లలో అన్యాయ కోతలు నిలిపివేయాలి. దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, సర్పంచులు పల్లా శ్రీకాంత్ రెడ్డి, ఆడరాపు హరికృష్ణ, తోటకూరి వెంకటయ్య, ఉపసర్పంచ్ కదారి సైదులు, ఇతరులు ముదిగొండ సంజీవ, అప్పనాల తిరుమల్, గుండాల వెంకట్, ఇటుకల రాజు, బొడ్డుపల్లి ఏడుకొండల, కడారి అచ్చయ్య, జక్కుల అంజి, కదారి శ్రీను, జబ్బు ఉమ్మయ్య పాల్గొన్నారు.

# టి.బి. ఉచిత ఛాతీ ఎక్స్‌రే క్యాంపు విజయవంతం



**ఎలికట్ట, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వర్ణకుమారి ఆదేశాల మేరకు, జిల్లా టి.బి. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పాపారావు సూచనలతో, చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎలికట్ట గ్రామంలో శుక్రవారం టి.బి. (క్షయవ్యాధి) ఉచిత ఛాతీ ఎక్స్‌రే క్యాంపు నిర్వహించారు.ఎమ్.ఎల్. హెచ్.పి. వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు ప్రజలకు అవగాహన కల్పించారు. "టి.బి. అంటే క్షయవ్యాధి. ఇది మైకో బ్యాక్టీరియం ట్యూబర్‌క్లోసిస్ వల్ల వస్తుంది. సాధారణంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, కఫంలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉంటాయి. సరైన చికిత్సతో పూర్తిగా నయం అవుతుంది" అని వివరించారు.ఈ క్యాంపులో 41 మంది ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్నారు. గ్రామ సర్పంచ్ నవకిరణ్ణి మాట్లాడుతూ, "గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. పరిశుభ్రత, పోషకాహారం, గాలి--వెలుతురు ఉన్న గదులు టి.బి. నివారణకు అవసరం" అని సూచించారు.కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ జహిందర్, టి.బి. సూపర్వైజర్ రవికుమార్, గ్రామ సెక్రటరీ తేజస్విని, ఏ.ఎన్.ఎమ్‌లు సుమతమ్మ, సుజాత, పుష్పలత, ఆశా వర్కర్లు హైమావతి, లలిత, సుమలత, యాదమ్మ, సక్కుబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వివోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-ప్రభుత్వం స్పందించాలి : జెన్నపల్లి పద్మకృష్ణ**



**మహేశ్వరం, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం మండల కేంద్రంలో ఐకెపి వివోఏల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు జరిగిన ధర్నాకు బీఆర్ఎస్ నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటించిన మాణిక్యమ్మగూడ సర్పంచ్, తెలంగాణ పంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెన్నపల్లి పద్మకృష్ణ మాట్లాడుతూ, "వివోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.వివోఏలకు కనీస వేతనం రూ.20,000 పెంచాలని, సెల్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్సీ పాలసీ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి పని భారం తగ్గించాలని కోరారు. అదేవిధంగా సీసీ పదోన్నతులు, రూ.20 లక్షల ఆరోగ్య భీమా కల్పించాలని సూచించారు."సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం" అని హెచ్చరించారు.ఈ ధర్నాలో వివోఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

**-కాంగ్రెస్ పాలన రైతు వ్యతిరేకం : టివిఎన్ రెడ్డి**



**దేవరకొండ, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు టివిఎన్ రెడ్డి ప్రశ్నించారు.మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు మేరకు కమలాపురం కొనుగోలు కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "కళ్లాల్లో ధాన్యం కొనుగోలు సరిగా జరగక రైతుల కళ్లల్లో కన్నీరు ఆగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు రైతులను మోసం చేశాయి. రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుంది. రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే సమాధానం చెబుతారు" అని హెచ్చరించారు."రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బిఆర్ఎస్" అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, రేపాని ఇద్దయ్య, జైహింద్ రెడ్డి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఆమనగల్లు లోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు....

**ఆమనగల్లు, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"అనే కార్యక్రమాన్ని పట్టణంలోని రైతు వేదికలో శనివారం నిర్వహిస్తారని ఇట్టి కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తలు రాబోయే వాన కాలంలో సాగు చేసే పంటల్లో సమస్యలకు సందేహాలను నివృత్తి చేస్తారన్నారు.ఈ కార్యక్రమాన్ని మండలంలోని రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అన్నారు.

# కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని బీజేపీ డిమాండ్



**జగిత్యాల, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం చేయకుండా కేంద్రీయ విద్యాలయం కోసం కనీసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ భోగ శ్రావణి డిమాండ్ చేశారు.జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ, చల్‌గల్ ప్రాంతంలో కేవలం 2 ఎకరాల స్థలం కేటాయించడం వల్ల ప్రాజెక్ట్ రిజెక్ట్ అయ్యే ప్రమాదం ఉందని, వెంటనే 5 ఎకరాలు కేటాయిస్తే అద్దె భవనంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్వార్థపూరితంగా వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్తును పక్కన పెట్టారని ఆమె విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కనీసం 20 ఎకరాల భూమి అవసరమని, విద్యార్థుల అంశంలో సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని ఆరోపించారు.అలాగే జగిత్యాల మున్సిపాలిటీలో కేంద్రం నుంచి వచ్చిన రూ.62 కోట్ల నిధుల పనుల్లో అవకతవకలు జరిగాయని, పూర్తయిన సీసీ రోడ్ల పనులకు మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని, 1--48 వార్డుల వరకు స్కాం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి అభివృద్ధి పనిపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.యావర్ రోడ్ విస్తరణపై టిడిఆర్ తీర్మానం ఆమోదమైనా పనులు చేపట్టలేదని ప్రశ్నిస్తూ, చిత్తశుద్ధి ఉంటే వెంటనే విస్తరణ చేసి చూపండి అని ఎమ్మెల్యేను సవాలు చేశారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, పవన్ సింగ్, గదాసు రాజేందర్, గడ్డల లక్ష్మి, మహిళ మోర్చా నాయకురాలు దూరిశెట్టి మమత, సిరిపురం శ్రీనివాస్, గట్టిపెల్లి జ్ఞానేశ్వర్, పూదరి శ్రీనివాస్, మధురిమ, సింగం పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజకీయాలు పక్కన పెట్టాలి అని డాక్టర్ భోగ శ్రావణి స్పష్టం చేశారు.

# శ్రీశైలంలో అంకాళమ్మకు విశేష పూజలు



**శ్రీశైలం, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత శ్రీ అంకాళమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు.ప్రతీ శుక్రవారం దేవస్థానం సేవగా జరిగే ఈ విశేష పూజలో అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు ఘనంగా జరిగాయి.ప్రధాన ఆలయానికి ఎదురుగా, ఉత్తరముఖంగా ఉన్న అంకాళమ్మ ఆలయం శ్రీశైల గ్రామదేవతగా ప్రత్యేక స్థానం కలిగి ఉంది. దేవీభాగవతం ప్రకారం గ్రామదేవతలు ప్రకృతి శక్తుల ప్రతిరూపాలుగా భావించబడతాయి.చతుర్భుజాలను కలిగిన ఈ దేవి కుడి చేతుల్లో కత్తి, సర్పంతో చుట్టబడిన డమరుకం, ఎడమ చేతుల్లో పానపాత్ర, త్రిశూలం ధరించి, కిరీట మకుటంతో అలంకరించబడి ఉంటుంది.కార్యక్రమం నిర్విఘ్నంగా జరగేందుకు ముందుగా మహాగణపతిపూజ నిర్వహించి, అనంతరం అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలంతో విశేష అభిషేకాలు జరిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల గోస

**ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి : కప్పాటి పాండురంగారెడ్డి**



**రంగారెడ్డి జిల్లా, మే 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి దారుణంగా ఉందని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, టీఆర్ఎస్ నాయకుడు కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు.రైతులు తరలించిన ధాన్యంలో 50% కూడా కొనుగోలు చేయలేదని, నాణ్యతా ప్రమాణాల పేరుతో క్వింటాలుకు 5--8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు, నీడ, టార్పాలిన్లు లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు.ధాన్యం విక్రయించినా రైతు ఖాతాల్లోకి డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని అయోమయం నెలకొంది. దీంతో తదుపరి సాగుకు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సన్న వరి పండించే రైతులకు క్వింటాకు రూ.500 అదనపు బోనస్‌ను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని, గన్నీ బ్యాగులు సరిపడా అందించాలని, తేమ శాతం పేరుతో వేధించే మిల్లర్లు--అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు."ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, రైతుల కష్టాలను గుర్తించి ధాన్యం కొనుగోలును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళనలను తీవ్రతరం చేస్తాం" అని హెచ్చరించారు.

# డంపింగ్ యార్డ్ శాశ్వత పరిష్కారానికై త్వరలో ప్రజా ఉద్యమం



**కరీంనగర్, మే 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని, శాశ్వత పరిష్కారం కోసం దశల వారీగా ఐక్య ఉద్యమాలు చేపడతామని సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎం), బీఆర్ఎస్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు ప్రకటించారు.బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ కారణంగా అల్కాపురి, లక్ష్మీనగర్, కట్టారాంపూర్, హనుమాన్ నగర్, గణేష్ నగర్, హౌసింగ్ బోర్డ్, మారుతినగర్, కాపువాడ కాలనీ ప్రాంతాల్లో ప్రజలు శ్వాసకోశ సమస్యలు, అస్తమా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నగరానికి చెందిన కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఇద్దరూ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పేరుకే స్మార్ట్ సిటీ అని, కానీ దుర్వాసన, కాలుష్యం ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తోందని పేర్కొన్నారు.త్వరలోనే రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం ఐక్య పోరాటం తప్పదని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు.

# బిజినెస్

## బెంజ్ నుంచి మరో మాడల్

**గరిష్ఠ ధర రూ.1.43 కోట్లు**



**న్యూఢిల్లీ, మే 21**

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్.. దేశీయ మార్కెట్‌క్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. జీఎల్‌ఈ, జీఎల్‌ఎస్ నైట్ ఎడిషన్స్ విడుదల చేసిన ఈ కారు రూ.1.05 కోట్ల నుంచి రూ.1.43 కోట్ల లోపు లభించనున్నాయి. లిమిటెడ్ ఎడిషన్‌గా ప్రవేశపెట్టిన ఈ కార్లను టెక్నాలజీ పరంగా అప్‌గ్రేడ్ చేసి ప్రవేశపెట్టింది.వీటిలో నైట్ ఎడిషన్ జీఎల్‌ఎస్ 450 మాడల్ ధర రూ.1.41 కోట్లుగాను, నైట్ ఎడిషన్ జీఎల్‌ఎస్ 450 డీ మాడల్ ధర రూ.143 కోట్లు, నైట్ ఎడిషన్ జీఎల్‌ఈ 300డీ మాడల్ రూ.1.05 కోట్లు, నైట్ ఎడిషన్ జీఎల్‌ఈ 450 విలువ రూ.1.14 కోట్లుగా నిర్ణయించింది.

## బంగారం కొనేవారికి బిగ్ షాక్..

**-మళ్లీ పెరిగిన పసిడి ధరలు.. తులం ఎంతంటే?**

పడిసి ప్రియులకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. గత కొన్నాళ్లు తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పుంజుకున్నాయి. వరుసగా మూడోరోజు మళ్లీ బంగారం ధరలు పెరిగాయి. నిన్నటితో పోల్చుకుంటే శుక్రవారం ఉదయం 6 గంటల వరకు బంగారం, వెండి ధరల్లో భారీ మార్పులు చేసుకున్నాయి. దీంతో బంగారం కొనేవారు తీవ్ర నిరాశచెందుతున్నారు. ముందే ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

బంగారం ధర కేవలం స్థానిక డిమాండ్‌పైనే కాకుండా అంతర్జాతీయ పరిణామాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ వాతావరణం, వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల ఇన్వెస్టర్లలో ఆందోళన పెరిగింది. ఇలాంటి సమయాల్లో స్టాక్ మార్కెట్లు నష్టపోయే ప్రమాదం ఉండటంతో, సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు అందరూ మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల డిమాండ్ పెరిగి ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. కాబట్టి



శుక్రవారం ఉదయం 6 గంటలకు దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940గా ఉండగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,610 గా ఉంది. ఇక కేజీ వెండి ధర చూసుకుంటే రూ.2,85,100 వద్ద ట్రేడవుతుంది.

**దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో బంగారం ధరలు**

హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,57,200 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

ఇక ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,680 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,48,110 వద్ద ట్రేడవుతోంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,940 వద్ద ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,46,610 వద్ద ట్రేడవుతోంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ఆవిరైన ఇన్వెస్టర్ల సంపద**

**హైదరాబాద్**

అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు, ముడిచమురు ధరల పెరుగుదల మరియు రూపాయి రికార్డు పతనం కారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆఖరి గంటలో చోటుచేసుకున్న భారీ అమ్మకాల ఒత్తిడితో ఆరంభ లాభాలు పూర్తిగా ఆవిరయ్యాయి.సెన్సెక్స్: 135 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ: కీలకమైన 24,000 మార్కు దిగువకు చేరింది.రూపాయి విలువ: డాలర్‌తో పోల్చితే ఎన్నడూ లేని విధంగా 96.50 స్థాయికి పడిపోయి ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేసింది.పతనానికి ప్రధాన కారణాలు:పశ్చిమాసియాలో (ఇరాన్ ఉద్రిక్తతలు) పెరుగుతున్న రాజకీయ అనిశ్చితి, అంతర్జాతీయ మార్కెట్లో



ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు మరియు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరంతరాయంగా షేర్లను విక్రయించడం మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఐటీ మరియు ఎనర్జీ రంగాల షేర్లు భారీగా నష్టపోగా, బ్యాంకింగ్ రంగం మాత్రం స్వల్పంగా రాణించింది.

## ఐపిఎల్‌కు విజయ్ శంకర్ టాటా

ముంబై,

:టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కు కూడా వీడ్కోలు పలుకుతున్నట్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించాడు. ఇన్నాళ్లు తనకు మద్దతుగా నిలిచిన బీసీసీఐ, ఫ్యాన్స్, భారత క్రికెట్ జట్టుకు ధన్యవాదాలు తెలిపాడు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'క్రికెటే నా జీవితం. పదేళ్ల వయసులో మొదలైన క్రికెట్ ప్రయాణం 25 ఏళ్ల తర్వాత ఈ స్థాయికి చేరింది. టీమిండియాలో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలోనే అత్యంత గర్వకారణమైన క్షణం' అని పేర్కొన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో తమిళనాడు తరఫున విజయ్ శంకర్ అద్భుత ప్రదర్శన చేశాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌తో పాటు, మీడియం పేస్ బౌలింగ్‌తో జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఈ నిలకడైన ఆటతీరే అతడికి జాతీయ జట్టులో చోటు సంపాదించి పెట్టింది. 2018లో శ్రీలంకలో జరిగిన నిదహాస్ ట్రోఫీ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన శంకర్.. ఆ తర్వాత వన్డేల్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం



వహించాడు. విజయ్ శంకర్ తన క్రికెట్ కెరీర్‌లో 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. విజయ్ శంకర్ కెరీర్‌లో అత్యంత కీలకమైన ఘట్టం 2019 వన్డే ప్రపంచ కప్. అప్పట్లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అంబటి రాయుడును పక్కన పెట్టి మరీ సెలక్టర్లు విజయ్ శంకర్‌ను ప్రపంచ కప్ జట్టులోకి ఎంపిక చేశారు. ఆ సమయంలో చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్.. అతడిని 'త్రీ డైమెన్షనల్' ప్లేయర్‌గా అభివర్ణించాడు. అప్పట్లో ఆ మాట క్రీడా వర్గాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ టోర్నీలో విజయ్ పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో వేసిన తొలి బంతికే వికెట్ తీసి రికార్డు సృష్టించాడు. అయితే ఆ తర్వాత కాలి వేలి గాయం కారణంగా టోర్నీ మధ్యలోనే నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత జాతీయ జట్టులోనూ చోటు కోల్పోయాడు. ఐపీఎల్‌లో విజయ్ శంకర్ చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్ జట్టు టైటిల్ గెలవడంలో, తర్వాతి సీజన్‌లో రన్నరప్‌గా నిలవడంలో విజయ్ శంకర్ కీలక పాత్ర పోషించాడు. ఆఖరిగా సీఎస్కే తరఫున ప్రాతినిధ్యం వహించాడు. కాగా ఈ సీజన్‌లో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదు. దేశీయ క్రికెట్‌లో కూడా విజయ్ శంకర్ ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 4,253 పరుగులు, 13 సెంచరీలు నమోదు చేయడంతో పాటు 43 వికెట్లు పడగొట్టాడు. లిస్ట్-ఏ, టీ20 ఫార్మాట్లలోనూ బ్యాట్, బంతితో తన ముద్ర వేశాడు. ఇప్పుడు అతని కొత్త ప్రయాణం ఎలా ఉండబోతోందో చూడాల్సి ఉంది.

## ఐపీఎల్‌లో 'ధోనీ స్కామ్'..

**అభిమానులను పిచ్చోళ్లను చేసిన సీఎస్కే..!**

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆటకోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. అయితే.. సీజన్ ఆసాంతం మహా భాయ్ ఫిట్‌నెస్‌పై, 'ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడే అవకాశముంది' అని అభిమానులను మభ్యపెట్టిన సీఎస్కే యామజమాన్యంపై మాజీ ఆటగాడు క్రిష్ణమాచారి శ్రీకాంత్ మండిపడ్డాడు. పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ స్కామ్‌కు తెర తీసిందని ఆయన తీవ్రంగా విమర్శించాడు.లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఒక్కటంటే ఒక్క మ్యాచ్ ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడుతాడని చెన్నై సూపర్ కింగ్స్



కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్దాలని అభిమానులు గ్రహించారు. ఈ విషయంపై మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ స్పందిస్తూ 'ధోనీ స్కామ్'కు సీఎస్కే తెర తీసిందని విమర్శించాడు.'సీజన్ ఆరంభం నుంచి ధోనీ గురించి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు ప్రతిసారి అబద్ధాలు చెబుతూ వచ్చారు. మొదట కాలి గాయంతో ధోనీ బాధ పడుతున్నాడని, అతడు త్వరలోనే జట్టుతో కలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ధోనీ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని చెపాక్‌లో చివరి మ్యాచ్ టాస్ సందర్భంగా గైక్వాడ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో పెట్టింది. దాంతో, తాలా కచ్చితంగా సన్‌రైజర్స్‌తో ఆడుతాడని అభిమానులు గంపెడు ఆశలతో మైదానానికి పోటెత్తారు. కానీ, మళ్లీ వారికి నిరాశే మిగిలింది' అని శ్రీకాంత్ యూట్యూబ్ ఛానెల్లో ఆగ్రహం వ్యక్తం చేశాడు.

# స్పోర్ట్స్

## బీహార్‌కు ఓ జట్టు ఉండాల్సిందే

**వేదాంత ఛైర్మన్న అనిల్ అగర్వాల్**




**పాట్నా,**

:ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాడు. బిహార్‌కు చెందిన ఈ 15 ఏళ్ల కుర్రాడు సంచలన ఆటతో ఆకట్టుకుంటున్నాడు. ఇలాంటి ఆటగాడు వచ్చిన బిహార్‌కూ ఓ ఐపీఎల్ జట్టు ఉండాలని బిలియనీర్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. భారత్‌లోనే అతిపెద్ద కార్పొరేట్ సంస్థల్లో ఒకటైన వేదాంతా గ్రూప్‌నకు ఆయన ఛైర్మన్. పట్నాలో 1954లో ఆయన జన్మించారు. సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు వైరల్‌గా మారింది. బిహార్ నుంచి అద్భుతమైన క్రికెటర్లు వస్తున్నారని అందులో పేర్కొన్నారు. 'ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మాదిరిగా బిహార్ కూడా అద్భుతమైన జట్టును కలిగి ఉండటానికి అర్హత ఉందని మీకు అనిపించడం లేదా? బిహార్ గడ్డ ఎంతో మంది నాణ్యమైన క్రికెటర్లను దేశానికి అందించింది. పట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించాడు. సమస్తిపుర్ నుంచి వచ్చిన వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ అరంగేట్రంలోనే రికార్డులు సృష్టించాడు. సకిబ్ హుస్సేన్ (ఎస్ఆర్‌హెచ్) గోపాల్‌గంజ్‌లోని ఓ సాధారణ కుటుంబానికి చెందిన ప్లేయర్. ఇలాంటివన్నీ చూసినప్పుడు నాకు ఒకటే అనిపించేది. ఎందుకు క్రికెట్‌లో బిహార్‌కు గుర్తింపు రావడం లేదు? బిహార్ యువత ప్రతి రంగంలోనూ రాణించేలా అవకాశాలు కల్పించడం. మన క్రీడాకారులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం అందించేలా చేయడం నా చిరకాల స్వప్నం. బిహార్ నుంచి వచ్చే జట్టు ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా నిలుస్తుందన్న పూర్తి విశ్వాసం నాకుంది' అని అనిల్ అగర్వాల్ పోస్టు పెట్టారు. నాలుగేళ్ల కిందట రెండు ఫ్రాంచైజీలు అదనంగా వచ్చిన సంగతి తెలిసిందే. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ అడుగు పెట్టాయి. ఇప్పటికే ఐపీఎల్ మార్కెట్ విలువ భారీగా ఉంది. దీంతో కొత్త ఫ్రాంచైజీలకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్లూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకటి, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి ఒక ఫ్రాంచైజీకి అనుమతి ఇవ్వాలని పలువురు కోరారు. ఇప్పుడు బిహార్‌కు చెందిన బిలియనీర్ నేరుగా రంగంలోకి దిగడంతో ఐపీఎల్ మేనేజ్‌మెంట్ ఏం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.